

గోవిందరావుపేట : దుంపిల్లగూడెంలో కాంటాలు కాకుండా ఉన్న ధాన్యం



కన్నాయిగూడెం : మిర్చి తోటలోకి చేరిన వర్షం నీరు



వెంకటాపూర్ : పాలంపేటలో ధాన్యంపై పరదాలు కప్పిన రైతులు

# అన్నదాతను ఆగం చేసిన మిగ్‌జాం

- తుఫాన్ ప్రభావంతో ఎడతెగని వర్షం
- పొలాల్లో చేరిన వాన నీరు
- తడిసి ముద్దయిన ధాన్యం రాశులు
- నేల వాలిన వరి, మిరప పంట
- ఆందోళనలో రైతులు

ములుగు రూరల్, డిసెంబర్ 6 : మిగ్‌జాం తుఫాన్ ములుగు జిల్లా అన్నదాతను ఆగం చేసింది. దీని ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా బుధవారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో చేతికొచ్చిన వరి, మిర్చి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ములుగు మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా పంటలు నీటి పాలు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరంతరరాయంగా కురుస్తున్న వర్షానికి పంటలను కాపాడుకోలేని స్థితిలో రైతులున్నారు. కొన్ని చోట్ల పత్తికాయలు నేలరాలిపోగా, మరికొన్ని చోట్ల ఈదురుగాలులకు చెట్లు విరిగిపోయాయి. అలాగే కొంతమంది రైతులు వరి పంట కోసం కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం రాశులపై పరదాలు కప్పుకున్నారు. వర్షం ఇలాగే ఉంటే పంటలపై ఆశలు వదులుకోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

### మంగపేటలో..

మంగపేట : తుఫాన్ ప్రభావంతో బుధవారం రోజంతా వర్షం కురిసింది. వారం క్రితం వరి పంటలు కోసిన రైతులు అమ్మకాల కోసం ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోసుకున్నారు. మరి కొంతమంది రైతులు మంగపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించారు. రేపో మాపో కాంటాలు ప్రారంభం అవుతాయని, చేతికి డబ్బులొస్తాయని ఆశపడ్డ రైతులను తుఫాను దెబ్బతీసింది. ధాన్యంలో తేమ శాతం అరక ముందే కురుస్తున్న వర్షం వల్ల ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. కప్పిన పరదాలపై కూడా నీళ్లు నిలిచాయి. టార్పాలిన్ షీట్లు, పరదాలు లేని రైతుల ధాన్యం రెండు రోజులుగా తడుస్తూనే ఉంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కోతకు సిద్దంగా ఉన్న వరితో పాటు, మిర్చి తోటల్లోకి నీరు చేరింది. మండలంలోని కమలాపురం, బోరునర్సాపురం, తిమ్మంపేట, మల్లూరు, పాలాయిగూడెం, వాడగూడెం, రమణక్కపేట, రాజుపేట, కత్తిగూడెం తదితర గ్రామాల శివారు గోదావరి పరీవాహకంలో సాగు చేసిన మిరప తోటలు వర్షానికి దెబ్బతినే పరిస్థితి నెలకొన్నదని రైతులు కలత చెందుతున్నారు.

### ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం : తుఫాను ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని ఆయా గ్రామాల్లో సాగు చేసిన మిర్చి తోటలు తెబ్బతిన్నాయి. మండల కేంద్రంతో పాటు, రామన్నగూడెం, రాంనగర్, రొయ్యూరు, ముళ్లకట్ట తదితర గ్రామాల శివార్లలో రైతులు పెద్ద ఎత్తున మిర్చి సాగు చేశారు. రెండు నెలల క్రితం నాటిన మిర్చి తోటలు కొన్ని ప్రాంతాల్లో పూత, మరి కొన్ని ప్రాంతాల్లో కాత దశలో ఉన్నాయి. ఈసారి మిర్చికి తెగుళ్లు విస్తారంగా రావడంతో రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా పెరిగింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి తోటల్లో నీళ్లు నిలిచి మొక్కలు దెబ్బతింటున్నాయని రైతులు చెబుతున్నారు. ఈవర్షం వల్ల పంట తెగుళ్ల భారిన పడే అవకాశముందని మిర్చి రైతులు తెలిపారు. అదే విదంగా కోతకు వచ్చిన వరి పంట, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసుకున్న ధాన్యం కూడా వర్షానికి దెబ్బతింటున్నట్లు పలు గ్రామాలకు చెందిన రైతులు వాపోతున్నారు. వరి పంట చేతికొచ్చే తరుణంలో కురుస్తున్న అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

### వాజేడులో..

వాజేడు : తుఫాన్ ప్రభావంతో మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో రోజంతా కురిసిన వర్షం నుంచి వరి ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు టార్పాలిన్లు కప్పుతున్నారు. కొన్నిచోట్ల కప్పిన కవర్లపై నీరు చేరింది. వరితో పాటు మిర్చి తోటల్లోకి సైతం వరద నీరు చేరడంతో నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట : తుఫాన్ ప్రభావంతో బుధవారం మండలంలో జోరుగా వర్షం కురిసింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో పడుతున్న వానలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. అటు ఆరబెట్టుకునేందుకు వీలు లేక, ఇటు కాంటాలు పెట్టుకోలేక భారీ నష్టం వాటిల్లనున్నదని రైతులు వాపోతున్నారు.



ఏటూరునాగారం : వర్షానికి దెబ్బతిన్న మిర్చి తోట

### వెంకటాపురం (నూగూరు)లో..

వెంకటాపురం (నూగూరు) : మండలంలో తుఫాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి, బుధవారం ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి పంట చేలల్లో నీరు నిలిచింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ పనులు స్తంభించిపోయాయి. వరి, మిర్చి తోటల్లోకి వర్షపు నీరు చేరడంతో పంటలు దెబ్బతిని తాము తీవ్రగా నష్టపోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### కన్నాయిగూడెంలో..

కన్నాయిగూడెం : తుఫాన్ ప్రభావంతో మండలవ్యాప్తంగా బుధవారం వర్షం దంచికొట్టింది. దీంతో పంటపొలాల్లోకి నీరు చేరి దెబ్బతిన్నాయి. వరి, మిర్చి చేతికొచ్చిన సమయంలో వర్షాలు కురుస్తుండటంతో తాము తీవ్రంగా నష్టపోతామని, మరోవైపు కోసి ఆరబోసిన ధాన్యం దెబ్బతింటున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### వెంకటాపూర్‌లో..

వెంకటాపూర్ : తుఫాన్ ప్రభావంతో బుధవారం మండల వ్యాప్తంగా వర్షం కురిసింది. వరి కోసి ఆరబెట్టుకున్న ధాన్యం కొన్నిచోట్ల తడిసింది. మరి కొన్ని చోట్ల ధాన్యంప రైతులు పరదాలు కప్పారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కష్టపడి పండించిన పంటలు నీటి పాలవుతున్నాయని వాపోతున్నారు.



వాజేడు : కొప్పుసూరులో టార్పాలిన్లపై నిలిచిన నీరు

## ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ములుగురూరల్, డిసెంబర్ 6 : ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ సురేందర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్‌సీని ప్రకటించి అమలు చేయాలన్నారు. కోర్టు కేసులతో పెండింగ్‌లో ఉన్న బదిలీలు, ప్రమోషన్లను చేపట్టాలని, పాఠశాలలో పారిశుధ్య కార్మికుల నియామకం, ఉచిత కరెంట్ సదుపాయం కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడానికి వినూత్నమైన కార్యక్రమాలను అమలు చేయాలని కోరారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

వాజేడు, డిసెంబర్ 6 : మండలంలోని గుమ్మడిదొడ్డికి చెందిన సీపీఎం కార్యకర్త మోడెం కృష్ణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, మండల నాయకులు బుధవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కృష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గురువారం నిర్వహించే పెద్దఖర్మ కోసం 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో గుగ్గిళ్ల దేవయ్య, బచ్చల కృష్ణబాబు, పాయం కుమారి, కారం భూలక్ష్మి, కారం నాగేశ్వరరావు, జెజ్జరి ఆదినారాయణ, మోడెం బాబురావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు బియ్యం అందజేస్తున్న నాయకులు

## ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో వెంకయ్య

గోవిందరావుపేట, డిసెంబర్ 6 : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలకు తరలించాలని డీపీవో వెంకయ్య అన్నారు. బుధవారం మండలంలోని గుండ్లవాగు, దయ్యాలవాగు బ్రిడ్జిలను, ప్రాజెక్టునగర్ ముంపు ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాల్‌లో కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వర్షాలు తగ్గే వరకు కార్యదర్శులు స్థానిక జీపీల్లోనే ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఆర్ఐలు రాజేందర్, సుధాకర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వాజేడు, డిసెంబర్ 6 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని వాజేడు ఎస్సై చావాళ్ల వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని మొరుమురు జీపీలోని మొరుమురుకాలనీ గ్రామంలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ అపరిచితులు బ్యాంక్‌ఖాతాలు, వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పొద్దన్నారు. అనంతరం గ్రామంలోని వాజేడు, వెంకటాపురం వెళ్లే రహదారిపై సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పేరూరు ఎస్సై గొర్ల రమేశ్

### పేరూరు ఎస్సై ఆధ్వర్యంలో..

మండలంలోని కృష్ణాపురం వద్ద జాతీయ రహదారిపై బుధవారం పేరూరు ఎస్సై గొర్ల రమేశ్ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఛత్తీసగఢ్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి అనుమతి పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

## అంబులెన్స్ దిగబడి పురిట్లోనే శిశువు మృతి

ఏటూరునాగారం, డిసెంబర్ 6 : ప్రసవానికి గర్భిణిని తీసుకెళ్తున్న అంబులెన్స్ బురదలో దిగబడి సకాలంలో ఆస్పత్రికి వెళ్లక పురిట్లోనే శిశువు మృతి చెందిన ఘటన మండలంలోని రాంనగర్‌లో బుధవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రమ్య పురిటి నొప్పులు రాగా 108లో ఏటూరునాగారం వైద్యశాలకు తీసుకొస్తుండగా రోడ్డు విస్తరణ పనుల కోసం పోసిన మట్టి వర్షానికి బురదమయంగా మారి అంబులెన్స్ అందులో దిగబడింది. వెంటనే గ్రామస్తులు ట్రాక్టర్‌తో అంబులెన్స్‌ను బయటకు లాగారు. అక్కడి నుంచి వైద్యశాలకు తీసుకెళ్లగా రమ్య ప్రసవించింది. కానీ పుట్టిన బిడ్డ కడుపులోనే ఉమ్మ నీరు తాగి మృతి చెందిననట్లు వైద్యులు తెలిపారు.

## ఉపాధ్యాయులు సంఘటితం కావాలి

ములుగు రూరల్, డిసెంబర్ 6 : ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) రాష్ట్ర చీఫ్ ప్యాటర్న్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం టీఆర్‌టీఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా పోరిక శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా అజ్మీరా రాజునాయక్, రాష్ట్ర కౌన్సిలర్లుగా బీ రామన్, ఈ జవహర్‌లాల్, పీ శివరామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల పరిశీలకుడు విష్ణుమూర్తి, సంజీవరెడ్డి నూతన కార్యవర్గానికి డైరీలు అందించారు.